1 APR 2018

## ప్రభుత్వ కార్యాలయాల పనివేళలలో మార్పు

**యానాం, మార్చి 31:** కేంద్రపాలిత ప్రాంతమైన పుదుచ్చేరి ప్రభుత్వం ఆదేశాల మేరకు యానాంలోని ప్రభుత్వ కార్యాలయాల్లో పనివేళల్లో పలు మార్పులు చేస్తున్నట్టు ప్రాంతీయ పరిపాలనాధికారి దవులూరి సుబ్రహ్మణ్యేశ్వరరావు తెలిపారు. వేసవి దృష్ట్యా వచ్చే ఏప్రిల్ 1 నుంచి జూన్ 15వ తేదీ వరకు యానాం నియోజకవర్గ పరిధిలోని పలు ప్రభుత్వ కార్యాలయాలలో పనివేళలు మార్పు చేయనునట్టు తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు, మధ్యాహ్నం 12.30 గంటల నుంచి 2.30 గంటల వరకు భోజన విరామం సమయంగా కేటాయించారు. మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు రెండో పూటగా పనివేళలు మార్పు చేస్తున్నట్టు తెలిపారు. ఈ నిబంధనలు యానాంలోని న్యాయ, ఆరోగ్య, విద్య, విద్యుత్ శాఖలకు మినహా అన్ని శాఖలకు వర్తిస్తుందన్నారు. నేడు ఆదివారం సెలవు దినం కావడంతో సోమవారం నుంచి పనివేళలు మారనున్నాయి.



## స్వచ్ఛ భారత్

**యానాం, మార్చి 31:** స్వచ్ఛ భారత్ ఉత్సవాల్లో భాగంగా ప్రతి శనివారం అధికారులు, విద్యార్థులు స్వచ్ఛ భారత్‌ను నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా యానాం ప్రజాపనులశాఖ ఆధీనంలో ఉన్న 55 ఎకరాల మంచినీటి చెరువుల సముదాయం వద్ద స్వచ్ఛ భారత్ నిర్వహించారు. పరిపాలనాధికారి దవులూరి సుబ్రహ్మణ్యేశ్వరరావు ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. స్థానిక నేతాజీ సుభాష్‌చంద్రబోస్ ప్రభుత్వ ఐటీఐ విద్యార్థులు, మున్సిపల్ సిబ్బంది సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ గౌరీసరోజ, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ పీహెచ్ కృష్ణసుధాకర్, ప్రోగ్రామ్ ఆఫీసర్ కర్రి అరుణకుమారి, సిబ్బంది లంకా ప్రసాద్, యర్ర నారాయణరావు, మున్సిపల్ సిబ్బంది రమణ రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

## రాజకీయ పార్టీ ప్రతినిధులతో సమావేశం

**యానాం, మార్చి 31:** నియోజకవర్గంలోని ఎన్నికల శాఖకు సంబంధించి పలు రాజకీయపార్టీ ప్రతినిధులతో యానాం ఓటర్ల నమోదు అధికారి దవులూరి సుబ్రహ్మణ్యేశ్వరరావు సమావేశం నిర్వహించారు. శనివారం ఉదయం జరిగిన ఈ సమావేశానికి కాంగ్రెస్ పార్టీకి చెందిన ఎంపి సిరాజుద్దీన్,అన్నాడీఎంకే పార్టీకి చెందిన మంచాల సత్యసాయికుమార్,డీఎంకే పార్టీకి చెందిన తాజుద్దీన్‌బాషలు హాజరైయ్యారు. పోలింగ్ బూత్‌లలో ఓటర్లసంఖ్య 1200 నుంచి 1400 వరకు ఉండని వాటి సంఖ్య ఆ బూత్‌లలో పెరగకుండా మరో పోలింగ్ బూత్‌కు బదలయించే అంశాలపై చర్చించారు. ఈ సమావేశంలో ఎన్నికలశాఖ ప్రతినిధులతో పాటు పలువురు పాల్గొన్నారు

## శ్రీసాయి విద్యానికేతన్‌లో కిడ్స్ కాన్వొకేషన్

**యర్రా గార్డెన్స్ (యానాం), మార్చి 31:** స్థానిక యర్రా గార్డెన్స్‌లోని సాయి విద్యానికేతన్‌లో కిడ్స్ కాన్వొకేషన్ ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి విద్యా సంస్థల చైర్మన్ నల్లం నాగబాబు, మంగా సత్యనారాయణ, ఎం.లోవరాజులు హాజరయ్యారు. శ్రీ సాయి విద్యా నికేతన్‌లోని యూకేజీ స్థాయిలో విద్యార్థులకు కాన్వొకేషన్ కార్యక్రమంలో భాగంగా కాన్వొకేషన్ పత్రాలను అందజేశారు. విద్యాసంస్థల ప్రతినిధులు ఆకుల వెంకట నాగలక్ష్మి, పెద్దిరెడ్డి లక్ష్మీసుధ, పోలిశెట్టి తాతారావు, మంగళ, ఎంఎస్ రాజు తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులతో విద్యాసంస్థల ప్రతినిధులు

## 'ఆడపిల్లల చదువు ఇంటికి వెలుగు'

**యానాం, మార్చి 31:** నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు బేటీ బచావో, బేటీ పడావో (ఆడపిల్లలను కాపాడండి, చదివించండి) కార్యక్రమంలో భాగంగా అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమ నిర్వహణపై ఉపాధ్యాయులు విద్యార్థులకు అవగాహన కల్పించారు. పరిపాలనాధికారి కార్యాలయం వద్ద నుంచి విద్యార్థుల ప్లకార్డులతో ర్యాలీని చేపట్టారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న పాఠశాలల విద్యార్థులు

## డాక్టర్ రవీంద్రకు ఘన సత్కారం

**యానాం, మార్చి 31:** హైదరాబాద్‌లోని డాక్టర్ బీఆర్‌కేఆర్ ప్రభుత్వ ఆయుర్వేద కళాశాలలో జరిగిన కుంతల 2018 జాతీయ స్థాయి సెమినార్‌లో యానాం ప్రభుత్వ ఆసుపత్రికి చెందిన మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రవీంద్ర చేసిన ప్రయోగం అందరినీ ఆకర్షించింది. నాస్యా కర్మ సిరోధర, సిరోలేప ప్రయోగంలో భాగంగా అమలా పురానికి చెందిన ఒక వ్యక్తిపై ప్రయోగం నిర్వహించారు.సుమారు 30 రోజు లపాటు అతనిపై తలపై ప్రయోగం చేసి వెంట్రుకలు ఏర్పడేలా ప్రయో గాన్ని నిర్వహించారు. ఈ ప్రయోగం మంచి ఫలితం సాధించడంతో జాతీయ స్థాయిలో జరిగే సెమినార్‌లో ప్రయోగ వివరాలను వివరించారు. ఈ సందర్భంగా డాక్టర్ రవీంద్రను నిర్వాహకులు అభినందించి సత్కరించారు.

1 APR 2018

## ఆడపిల్లలే ఇంటికి వెలుగు

**ప్రజాశక్తి - యానాం**

ఆడపిల్లలే ఇంటికి వెలుగు అని పలువురు కొనియాడారు. పుదుచ్చేరి ప్రభుత్వ సాంఘిక సంక్షేమశాఖ ఆధ్వర్యాన జరుగుతున్న బేటి బచావో వారోత్సవాల్లో భాగంగా జాకీర్ హుస్సేన్ ప్రైమరీ స్కూల్లో ప్రాంతీయ విద్యాశాఖ అధికా ర్యాలీ ప్రారంభించారు. అనంతరం విద్యార్థినులకు గులాబీలను అందించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం జయలత, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఐటీఐ విద్యార్థుల స్వచ్ఛభారత్

యానాం చివరన ఉన్న మంచినీటి చెరువుకు చుట్టుపక్కల చెత్తను తొలగించడంలో భాగంగా నేతాజీ సుభాష్ చంద్రబోస్ ప్రభుత్వ ఐటీఐ విద్యార్థులు స్వచ్ఛభారత్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా యానాం ప్రాంతీయ పరిపాలనాధికారి దవులూరి సుబ్రహ్మణ్యేశ్వరరావు హాజరయ్యారు. చీపురుపట్టి పరిసరాలను శుభ్రపరిచి విద్యార్థులతో పాటూ స్వచ్ఛభారత్ నిర్వహించారు. వీరితో పాటు ఐటీఐ ఇన్‌స్ట్రక్టర్, సిబ్బంది పాల్గొన్నారు.

## పోలింగ్ బూత్‌లపై సమీక్ష

యానాం ప్రాంతీయ పరిపాలనాధికారి దవులూరి సుబ్రహ్మణ్యేశ్వరరావు స్థానిక పార్టీ నాయకులతో శనివారం పోలింగ్ బూత్‌లపై చర్చించారు. 800 కన్నా మరీ ఎక్కువ ఉన్న ఓటర్లను ఆయా బూతుల్లో సరిచేసే క్రమంపై చర్చించారు. ఈ చర్చల్లో యానాం బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు సిరాజుద్దీన్, అన్నా డీఎంకె అధ్యక్షులు మంచాల సాయి, ఎన్.ఆర్. కాంగ్రెస్ అధ్యక్షులు పాల్గొన్నారు.



నాయకులతో సమీక్షిస్తున్న సుబ్రహ్మణ్యం

సాక్షి

1 APR 2018

# విద్యార్థి దశలోనే లక్ష్యాన్ని నిర్దేశించుకోవాలి

యానాం: విద్యార్థి దశలోనే లక్ష్యాన్ని నిర్దేశించుకుని ఆ దిశగా దాని సాధనకు కృషి చేయాలని నల్లం కాన్సెప్ట్ స్కూల్ చైర్మన్ నల్లం నాగబాబు పేర్కొన్నారు. శనివారం స్థానిక సాయి విద్యాసంస్థల ప్రాంగణంలో జరిగిన నల్లం, సాయివిద్యార్థుల ప్రథమ కిడ్స్ కాన్వికేషన్ సందర్భంగా జరిగిన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. భవిష్యత్తులో విద్యార్థుల్లో స్ఫూర్తినింపేందుకు స్నాతకోత్సవాన్ని తలపించేలా కిడ్ కాన్వికేషన్‌పేర ఇటువంటి కార్యక్రమాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం ఆయన చేతుల మీదుగా యూకేజీ పూర్తిచేసిన విద్యార్థులకు సర్టిఫికెట్‌లు,



కిడ్స్ కాన్వికేషన్‌లో సర్టిఫికెట్‌లు పొందిన విద్యార్థులు

మెడల్స్‌ను ఆయన అందజేశారు. అనంతరం వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయబృందం పాల్గొన్నారు.

## 'అసెంబ్లీని సస్పెండ్ చేయండి'

యానాం: పుదుచ్చేరి అసెంబ్లీని సస్పెండ్ చేయాలని డిమాండ్ చేస్తూ శనివారం బీజేపీ నామినేటెడ్ ఎమ్మెల్యేలు సామినాథన్, సెల్వ గణపతి, కేజీ శంకర్ కేంద్రహోమ్‌మంత్రి రాజ్‌నాథ్‌సింగ్‌కు వినతిపత్రం అందజేశారు. ఎన్ఆర్ కాంగ్రెస్ అధ్యక్షుడు రంగసామితో కలిసి వారు బీజేపీ జాతీయ అధ్యక్షుడు అమిత్‌షాను కలిశారు. అయితే రంగసామి తిరిగి పుదుచ్చేరికి చేరుకోగా ముగ్గురు నామినేటెడ్ ఎమ్మెల్యేలు రాజ్‌నాథ్‌సింగ్‌ను కలిసి మాట్లాడుతూ తమను అసెంబ్లీలోనికి అనుమతించాలని హైకోర్టు ఆదేశాలు ఇచ్చిన ప్పటికీ స్పీకర్, పోలీస్‌శాఖ అనుమతించడం లేదని అన్నారు. తక్షణం పుదుచ్చేరి అసెంబ్లీని సస్పెండ్ చేయాలని వారు కోరారు.

## మహిళాసాధికారతపై అవగాహన సదస్సు

యానాం: స్థానిక దరియాలతిప్పలోని డాక్టర్ కేఆర్‌నారాయణన్ ఉన్నత పాఠశాలలో శనివారం మహిళాసాధికారత అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో చైల్డ్‌వెల్ఫేర్ కమిటీ చైర్‌పర్సన్ సీహెచ్ లక్ష్మీబాయి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలు సాధికారత ద్వారానే అభివృద్ధి సాధ్యమని అన్నారు. మహిళ విద్యాధికురాలు కావడం ద్వారా మొత్తం కుటుంబమే అభివృద్ధి సాధిస్తుందన్నారు. మహిళలు విద్యకు ప్రాధాన్యతనివ్వాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నక్కా వాసుదేవరావు, ఉపాధ్యాయురాలు అనిత, అధ్యాపకురాలు తిరుకోటి సుబ్బలక్ష్మి, అంగన్‌వాడి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఈనాడు

1 APR 2018

# 'ఆడపిల్లలే ఇంటికి రక్షణ'

దరియాలతిప్ప(యానాం), న్యూస్‌టుడే: మొక్కను ఓర్పుగా పెంచితే అది పెద్దయ్యాక ఎలా నీడనిచ్చి రక్షణ కల్పిస్తుందో అదే విధంగా ఆడపిల్లలను కంటికి రెప్పలా కాపాడుతూ పెంచితే పెద్దయ్యాక వారే కుటుంబసభ్యులకు రక్షణగా, తోడుగా నిలుస్తారని యానాం చైల్డ్ వెల్ఫేర్ కమిటీ ఛైర్‌పర్సన్ చెక్కపల్లి లక్ష్మీబాయి పేర్కొన్నారు. డాక్టర్ కె.ఆర్.నారాయణన్ ప్రభుత్వ ఉన్నతపాఠశాల్లో రాష్ట్రీయ మాధ్యమిక శిక్షాభియాన్ నిధులతో శనివారం నిర్వహించిన బాలికా సాధికారత సదస్సులో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. తల్లిదండ్రులు ఆడపిల్లను బరువుగా భావించకుండా మానసికంగా, శారీరకంగా ఎదిగిన తర్వాత 18 ఏళ్లకు పెళ్లి చెయ్యాలని, ఒక వేళ బాల్యవివాహాలు జరుగుతున్న విషయం తమ దృష్టికి వస్తే 1098కి ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని సూచించారు. దీనివల్ల ఒక ఆడబిడ్డ జీవితాన్ని రక్షించినవారవుతారని ఆయన తెలిపారు. సమావేశానికి ప్రధానోపాధ్యాయుడు ఎస్.వాసుదేవరావు అధ్యక్షత వహించారు. తిరుకోటి సుబ్బలక్ష్మి, ఎస్.అనిత, కుమారి తదితరులు ప్రసంగించారు. చింతా రామచంద్రరావు, వ్యాయామ ఉపాధ్యాయుడు పినకోటి సత్యనారాయణ, పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.

**బేటీ బచావో - బేటీ పడావో ర్యాలీ:**

బాలికా సంరక్షణ గురించి ప్రజల్లో చైతన్యం తేవడానికి డాక్టర్ జాకీర్ హుస్సేన్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులు యానాం పురవీధుల్లో శనివారం ర్యాలీ చేశారు. ఆడపిల్లల్ని చదివించండి... రక్షించండి... అంటూ నినాదాలు చేశారు. ర్యాలీని విద్యాశాఖాధికారి కాలే సాయినాథ్ ప్రారంభించారు.

## పోలింగ్‌బూత్‌ల రేషనలైజేషన్‌పై సమీక్ష



పోలింగ్‌బూత్‌ల రేషనలైజేషన్ ప్రక్రియపై సమీక్షిస్తున్న దృశ్యం

యానాం: యానాం నియోజకవర్గ పరిధిలోని పోలింగ్‌బూత్‌ల రేషనలైజేషన్ ప్రక్రియకు సంబంధించి శనివారం స్థానిక ఆర్‌ఏఓ కార్యాలయంలో పరిపాలనాధికారి దవులూరి సుబ్రహ్మణ్యేశ్వరరావు అధ్యక్షతన రాజకీయ పార్టీలతో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా అత్యధికంగా ఓట్లు నమోదవుతున్న పోలింగ్ బూత్‌లను పరిశీలించి ఓటర్లకు అనుగుణంగా బూత్‌ల సంఖ్య పెంచడానికి సమావేశంలో చర్చించారు. ఈ కార్యక్రమంలో డీటీ షైజు, బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సిరాజుద్దీన్, డీఎంకే అధ్యక్షుడు తాజుద్దీన్‌బాషా, ఎఐఏడీఎంకే అధ్యక్షుడు మంచాల సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ఎన్ఎస్ఎస్ వలంటీర్ల స్వచ్ఛభారత్



యానాం రక్షితమంచినీటి చెరువు ప్రాంగణం వద్ద చెత్తను తొలగిస్తున్న దృశ్యం

యానాం: స్వచ్ఛభారత్ కార్యక్రమంలో భాగంగా శనివారం స్థానిక నేతాజీసుభాష్‌చంద్రబోస్ ప్రభుత్వ ఐటీఐ ఎన్ఎస్ఎస్ వలంటీర్లు, మున్సిపాలిటీ యంత్రాంగం సంయుక్తంగా పరిశుభ్రత కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక వైఎస్సార్ విగ్రహం వద్ద నున్న బొటానికల్ గార్డెన్ చెంతనే వున్న రక్షితమంచినీటి చెరువు ప్రాంగణాన్ని పరిపాలనాధికారి దవులూరి సుబ్రహ్మణ్యేశ్వరరావు ఆధ్వర్యంలోని స్వచ్ఛభారత్ బృందం చెత్తను, ప్లాస్టిక్ వ్యర్థాలను, ఖాళీబాటిల్స్‌ను తొలగించి పరిశుభ్రం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యానాంలో స్వచ్ఛభారత్ కార్యక్రమం ప్రతివారం నిర్విఘ్నంగా ఉద్యమంలా సాగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ గుబ్బ గౌరీసరోజ, ఎన్ఎస్ఎస్ రీజినల్ కోఆర్డినేటర్ చింతపల్లి కృష్ణసుధాకర్, ప్రోగ్రామ్ ఆఫీసర్ కర్రి అరుణకుమారి పాల్గొన్నారు.

1 APR 2018 ఈనాడు

## పోలింగ్ కేంద్రాల పెంపుపై సమావేశం

యానాం, న్యూస్‌టుడే: యానాం నియోజకవర్గంలోని సావిత్రినగర్, దరియాలతిప్ప, కనకాలపేట గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాల్లో ఓటర్ల సంఖ్య పెరిగిన నేపథ్యంలో ఆ కేంద్రాలను ఏమేరకు పెంచాలన్న అంశంపై శనివారం ఇక్కడి పరిపాలనాధికారి కార్యాలయంలో రాజకీయపార్టీల ప్రతినిధులతో సమావేశం జరిగింది. కేంద్ర ఎన్నికల సంఘం నిర్దేశిత ప్రమాణాల ప్రకారం అర్బన్ ప్రాంత పోలింగ్ కేంద్రంలో 1,400 మంది, గ్రామీణ ప్రాంత పోలింగ్ కేంద్రంలో 1,200 మంది ఓటర్లకు మించకూడదు. యానాం నియోజకవర్గాన్ని పూర్తి అర్బన్ ప్రాంతంగా పరిగణిస్తున్నారు. సావిత్రినగర్ బూత్ -17లో 1,555, దరియాలతిప్ప బూత్-12లో 1,402, కనకాలపేట బూత్-33లో 1,513 మంది ఓటర్లు ఉన్నారు. దరియాలతిప్ప కేంద్రంలోని పారిశ్రామికవాడ ప్రాంత ఓటర్లను ఇసుక కాలువలోకి మళ్లించాలని, మిగిలిన రెండు చోట్ల అదనపు పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయాలని వివిధ పార్టీల ప్రతినిధులు సూచించారు. పరిపాలనాధికారి దవులూరి సుబ్రహ్మణ్యేశ్వరరావు నేతృత్వంలో జరిగిన ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఎం.ఎ.సిరాజుద్దీన్, అన్నాడీఎంకె కార్యదర్శి మందాల సత్యసాయికుమార్, డీఎంకె పార్టీ కన్వీనర్ ఎస్.ఎం.తాజుద్దీన్‌బాషా, ఉప తహసీల్దార్లు షైజు, జయచంద్రన్, ఎన్నికల ఉద్యోగి ఎస్.వంశీ పాల్గొన్నారు.

## మంచినీటి చెరువు వద్ద స్వచ్ఛభారత్

యానాం, న్యూస్‌టుడే: యానాం పట్టణానికి, తీర గ్రామాలకు రక్షిత మంచినీటిని అందించేందుకు నిర్మించిన అదనపు రక్షిత నీటి చెరువు గట్టుపై శనివారం ఉదయం స్వచ్ఛభారత్ నిర్వహించారు. యానాం మున్సిపల్ కమిషనర్ గుబ్బ గౌరీసరోజ పర్యవేక్షణలో పారిశుద్ధ్య కార్మికులు, ఇంజినీరింగ్, ఇతర విభాగాల ఉద్యోగులు, అగ్నిమాపకదళం సభ్యులు, నేతాజీ సుభాష్‌చంద్రబోస్ ప్రభుత్వ ఐటీఐ విద్యార్థులు ఈ కార్యక్రమాన్ని జరిపారు. దీనిని ప్రాంతీయ పరిపాలనాధికారి దవులూరి సుబ్రహ్మణ్యేశ్వరరావు ప్రారంభించారు. గట్టు లోపలివైపు, వెలుపలా పెరిగిపోయిన తుమ్మ ముళ్లచెట్లను అగ్నిమాపకదళం తొలగించగా, నరికేసిన కొమ్మల్ని, చెట్లను మున్సిపల్ సిబ్బంది తీసేశారు. చెరువు గట్టు చుట్టూ వేసిన ప్లాస్టిక్ చెత్త, ముక్కల్ని జాతీయ సేవాపథకం నిర్వాహకుడు చింతపల్లి కృష్ణసుధాకర్ ఆధ్వర్యంలో విద్యార్థులు తొలగించారు. ఈ కార్యక్రమంలో జేఈ మట్టా శ్రీనివాస్, ప్రోగ్రాం అధికారి కె.అరుణకుమారి, లంక ప్రసాద్, శానిటరీ మేస్త్రి గూటం రాంబాబు బృందం పాల్గొన్నారు.


చెరువు గట్టును శుభ్రం చేస్తున్న పరిపాలనాధికారి బృందం

### తప్పిన ప్రాణాపాయం

ఆంధ్రా చెరువు వద్ద శనివారం ఉదయం స్వచ్ఛభారత్ సందర్భంగా మున్సిపల్ కార్మికుడు నాటి రామన్నకు త్రుటిలో ప్రాణాపాయం తప్పింది. కట్టర్ సాయంతో నరికిన తుమ్మ చెట్లను తొలగించే ప్రయత్నంలో తీగకు పచ్చి కొమ్మ తగలగా దాని నుంచి విద్యుత్తు ప్రసరించింది. దీంతో అస్వస్థతకు గురైన రామన్నను వెంటనే ప్రభుత్వాసుపత్రికి తరలించి ప్రథమ చికిత్స చేసి వైద్యుల పర్యవేక్షణలో ఉంచారు.

## రంగసామివి పగటి కలలు : నారాయణసామి

**యానాం:** పుదుచ్చేరిలో దొడ్డిదారిన అధికారంలోకి రావడానికి ఆలిండియా నమదురాజ్యం కాంగ్రెస్ అధ్యక్షుడు ఎన్.రంగసామి పగటి కలలు కంటున్నారని ముఖ్యమంత్రి వి.నారాయణసామి ఎద్దేవా చేశారు. నామినేటెడ్ ఎమ్మెల్యేల నియామకం విషయంలో అధికార కాంగ్రెస్, కేంద్రంలోని భాజపా ప్రభుత్వాల మధ్య నెలకొన్న వివాదం నేపథ్యంలో తలెత్తిన పరిణామాలను తనకు అనుకూలంగా మార్చుకునేందుకు ఎన్.ఆర్.కాంగ్రెస్ చేస్తున్న ప్రయత్నాలపై సీఎం నారాయణసామి విమర్శలు గుప్పించారు. రంగసామి ప్రజాస్వామ్య విలువల్ని పూర్తిగా తుంగలోకి తొక్కి, ఏదోవిధంగా అధికారాన్ని చేజిక్కించుకోవాలని ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. రెండేళ్ల పాటు ప్రతిపక్షంలో ఉన్న రంగసామి అసెంబ్లీ సమావేశాల్లో నిర్మాణాత్మకంగా వ్యవహరించలేదన్నారు. అధికార పార్టీ పథకాల అమలులో విఫలమైందని ఆరోపించి అయిదు నిమిషాల్లోనే సభ నుంచి వాకౌట్ చేసి వెళ్లడం తప్ప ప్రజల గురించి ప్రశ్నించిందేమీ లేదని దుయ్యబట్టారు. కేంద్రంలోని భాజపా సహకారంతో ఇప్పుడు అక్రమ మార్గంలో అధికారంలోకి రావడానికి ప్రయత్నిస్తున్నారని, ఆయన ఆటలు సాగవని స్పష్టం చేశారు. కొందరు కాంగ్రెస్ ఎమ్మెల్యేలతో వారు బేరసారాలు సాగిస్తున్నారన్న అంశాన్ని సీఎం అంగీకరించారు. నామినేటెడ్ ఎమ్మెల్యేల వ్యవహారంలో ఏం చెయ్యాలన్న విషయమై ముఖ్యమంత్రి నారాయణసామి, పీసీసీ అధ్యక్షుడు ఎ.నమశ్శివాయ లకు ఎ.ఐ.సి.సి. అధ్యక్షుడు రాహుల్‌గాంధీ పూర్తి స్వేచ్ఛనివ్వడంతో పార్టీ ఎమ్మెల్యేలతో భవిష్యత్తు కార్యాచరణపై సీఎం చర్చించారు.

✦ **దిల్లీ వెళ్లిన బేడీ:** నామినేటెడ్ ఎమ్మెల్యేలను సభలోకి ప్రవేశించకుండా స్పీకరు వి.వైద్యలింగం చేసిన ప్రయత్నాలపై ఇప్పటికే కేంద్ర హోంశాఖకు నివేదిక అందజేసిన లెఫ్టినెంట్ గవర్నర్ కిరణ్‌బేడీ దిల్లీ వెళ్లడం ప్రాధాన్యతను సంతరించుకుంది. ప్రభుత్వాన్ని బర్తరఫ్ చేయాలని నామినేటెడ్ ఎమ్మెల్యే సామినాథన్ బృందం కేంద్ర హోంమంత్రి రాజ్‌నాథ్‌సింగ్‌కు ఫిర్యాదు చేయడంతో పలు అంశాలపై చర్చించేందుకు కిరణ్‌బేడీ దిల్లీ వెళ్లారు.

## బట్టతలపై పరిశోధనపత్రం

యానాం, న్యూస్‌టుడే: హైదరాబాద్‌లోని డీఆర్‌కేఆర్ ప్రభుత్వ ఆయుర్వేద కళాశాల్లో కేశశాస్త్రంపై శుక్రవారం నిర్వహించిన జాతీయ సదస్సులో యానాం ఆయుర్వేద హోమియో ఆసుపత్రి వైద్యుడు డాక్టర్ కడలి రవీంద్ర సమర్పించిన పత్రానికి జాతీయ స్థాయిలో ప్రథమ స్థానం లభించింది. దేశంలోనే తొలిసారిగా కేశశాస్త్రంపై నిర్వహించిన సదస్సులో 500 మంది వైద్యులు పాల్గొని విస్తృత చర్చలు జరిపారు. డాక్టర్ కడలి రవీంద్ర నస్య కర్మ, శిరోధార, శిరోలేపనం సహాయంతో బట్టతలపై వెంట్రుకలు మొలిపించిన వైనం గురించి పత్రాన్ని సమర్పించగా 50 పరిశోధన పత్రాల్లో మొదటిస్థానం లభించింది. దీనిని ఆయుర్వేద వైద్యవిభాగం వెలువరించిన పుస్తకంలో ప్రచురించారని, సదస్సులో పాల్గొనడం ద్వారా అనేక కొత్త విషయాలు తెలుసుకోగలిగానని రవీంద్ర తెలిపారు. 2014లో ఆయుర్వేద విద్య పూర్తిచేసిన రవీంద్ర మూడేళ్ల నుంచి యానాం ఆయుర్వేద, హోమియో ఆసుపత్రిలో వైద్యసేవలు అందిస్తున్నారు. పుదుచ్చేరి ఆయుర్వేద విభాగం నోడల్ అధికారి డాక్టర్ ఎం.పురుషోత్తం సదస్సుకు నేతృత్వం వహించారు. కడలి రవీంద్ర పరిశోధన పత్రానికి లభించిన గుర్తింపు, బహుమతిపై ఆయుర్వేద, హోమియో విభాగాధిపతి డాక్టర్ స్వాతి స్టీవెన్సన్, ఛాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ కార్యదర్శి ఈలప్రోలు విష్ణువర్ధనరావు అభినందనలు తెలిపారు.


జ్ఞాపిక స్వీకరిస్తున్న రవీంద్ర

పెన్ పవర్
1 APR 2018

# పరిశ్రమ పరిశుభ్రతపై అవగాహన పెంచుకోవాలి : డిప్యూటీ కలెక్టర్



యానాం, పెన్‌పవర్: ప్రజలు నివసించే పరిసరాల పరిశుభ్రతపై అవగాహన పెంచుకొని ప్రజలు ఆరోగ్యవంతులుగా ఉండాలని యానాం డిప్యూటీ కలెక్టర్ దవులూరి సుబ్రహ్మణ్యేశ్వరరావు పేర్కొన్నారు. శనివారం ఉదయం స్థానిక 50ఎకరాల చెరువు ప్రాంతంలో మున్సిపాలిటీ సిబ్బంది మరియు ఎన్ఎస్ఎస్ విద్యార్థుల ఆధ్వర్యంలో స్వచ్ఛ భారత్‌ను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న కలెక్టర్ మాట్లాడుతూ యానాం ప్రతీ ప్రాంతంలో ఉన్న ప్రజలు వారి వారి నివసించే ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకుని అనారోగ్యముల నుండి బయట పడి ఆరోగ్యముగా ఉండాలని తెలిపారు. అదేవిధంగా పరిసరాల పరిశుభ్రతపై ప్రజలు అందరికీ అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. అనంతరం చెరువు చుట్టూ ఉన్న పిచ్చి మొక్కలను చెత్తను తొలగించి శుభ్రపరిచినారు. ఈ కార్యక్రమములో మున్సిపల్ కమీషనర్ జి.గౌరిసరోజ, ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్ చింతపల్లి కృష్ణ సుధాకర్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ కర్రి అరుణకుమారి నేతాజీ సుభాష్ చంద్రబోస్ ప్రభుత్వ ఐటిఐ ఎన్ఎస్ఎస్ విద్యార్థులు యానాం మున్సిపాలిటీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# రాజకీయ పార్టీ నాయకులతో డిప్యూటీ కలెక్టర్ సమావేశం

యానాం, పెన్‌పవర్: యానాం రాజకీయ పార్టీ నాయకులతో సమావేశం ఏర్పాటుచేసిన యానాం డిప్యూటీ కలెక్టర్ దవులూరి సుబ్రహ్మణ్యేశ్వరరావు శనివారం ఉదయం వివిధ రాజకీయ పార్టీ నాయకులతో సమావేశమై యానాంలో ఉన్న ఓటర్ల బూత్‌లను ఓటర్ల సంఖ్యను బట్టి పెంచే విషయంపై చర్చించు బూత్‌నకు 800 కంటే ఎక్కువగా ఉన్న ఓటర్లను తక్కువగా ఉన్న బూత్‌లో చర్చించి వారి అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సమావేశంలో యానాం కాంగ్రెస్ పార్టీ నాయకులు సిరాజేద్దీన్, అన్నాడిఎంకె పార్టీ నాయకులు మంచాలా సత్యసాయికుమార్, డిఎంకెసి పార్టీ నాయకులు రాజేఉద్దీన్ తదితరులు పాల్గొన్నారు.



# బేటిబచావో బేటిఫడావో ర్యాలి



యానం, పెన్‌పవర్: బేటి బచ్చావో బేటి ఫడావో ప్రారంభోత్సవాలు సందర్భంగా శనివారం స్థానిక జాకీర్ ఉస్సేన్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులు ఉపాధ్యాయులు ఆధ్వర్యంలో ర్యాలి నిర్వహించారు. ఈ ర్యాలిని యానాం ప్రాంతీయ విద్యాశాఖాధికారి కాలేసాయి నాథ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి సమాజములో ఆడపిల్లల సంఖ్య మగవారి కంటే తక్కువగా ఉన్నాదని 2011 జనాభా లెక్కల ప్రకారం రుజువైందన్నారు. అందువలన ఆడవారి సంఖ్య పెరిగే విధంగా ఆడవారి రక్షణ కొరకు ఆడవాళ్ళ అభివృద్ధి చెందే విధంగా భారత ప్రధాన మంత్రి నరేంద్రమోదీ 2015లో రాష్ట్రంలో బేటి బచ్చావో బేటి ఫడావో కార్యక్రమాన్ని ప్రారంభించారని తెలిపారు. అనంతరం ఈ ర్యాలి యానాం పురవీధుల మీదుగా సాగింది. ఈ ర్యాలిలో విద్యార్థులు ఆడపిల్లలను రక్షించండి ఆడపిల్లలను గౌరవించండి అంటూ నినాదాలు చేసి ర్యాలిని నిర్వహించారు. ఈ కార్యక్రమములో పాఠశాల ప్రధానోపాధ్యాయులు నమలత, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

విజయభాను 1 APR 2018

# మంచినీటి చెరువుల వద్ద స్వచ్ఛభారత్



యానాం : స్థానిక గోపాల్‌నగర్‌లోని మంచినీటి చెరువుల వద్ద స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. శనివారం ఉదయం ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో నేతాజి సుభాష్ చంద్రబోస్ ప్రభుత్వ ఐటిఐకి చెందిన ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు మంచినీటి చెరువుల చుట్టు ఉన్న చెత్తాచెదారాన్ని, పిచ్చి మొక్కలను తొలగించి శుభ్రత కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పరిపాలనాధికారి దవులూరి సుబ్రమణ్యేశ్వరరావు, మున్సిపల్ కమీషనర్ జి గౌరీపరోజాలు పరిసరాల పరిశుభ్రత కార్యక్రమానికి పాల్గొన్నారు.

రీజనల్ ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ చింతపల్లి క్రిష్ణ సుధాకర్ అధ్యక్షతన స్వచ్ఛ భారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. సుమారు 30 మంది వాలంటీర్లు పాల్గొన్నారు.

# అగ్రహారం నుండి ద్రాక్షారాం రోడ్డు వరకు రోడ్డు నిర్మించాలి

యానాం : స్థానిక అగ్రహారం దానమ్మగుడి నుండి వైఎస్ఆర్ ఇంటర్ నేషనల్ ఇండోర్ స్టేడియంను ఆనుకొని ఉన్న ప్రధాన డ్రైనేజ్ ప్రక్కనే ఉన్న రోడ్డు మార్గానికి నిధులు ఏర్పాటుచేసి నిర్మాణ పనులు చేపట్టాలని దరియాలతిప్ప రైతు సంఘ మాజీ అధ్యక్షుడు సామాజిక కార్యకర్త మల్లాడి సత్తిబాబు డిమాండ్ చేశారు. ఈ రోడ్డును ఆనుకొని బెజవాడ గార్డెన్స్, ఎర్రాగార్డెన్స్ అగ్రహారం ప్రజలకు ఎంతో మేలు కలుగుతుందన్నారు. ఈ రోడ్డు నిర్మాణం వలన ఈ ప్రాంతం అభివృద్ధిచెందుతుందన్నారు. ఇప్పటికే ఈ ప్రాంతంలోని అనేక భవనాలు వెలసినప్పటికీ ఈ మార్గన్ని నిర్మించకపోవడం వలన ద్రాక్షారాం రోడ్డుకు వెళ్ళేందుకు చుట్టూ తిరిగి రావలసి వస్తుందని అన్నారు. ఈ రోడ్డు నిర్మాణ పనులు పూర్తి అయితే క్రీడా ప్రాంగణాన్ని వీక్షించేందుకు ప్రజలు అధిక సంఖ్యలో తరలి వస్తారన్నారు.

ప్రధాన డ్రైనేజ మార్గానికి కాంక్రీట్‌వాల్ నిర్మించి దానిపై స్లేట్లు నిర్మిస్తే ఎంతో సుందరంగా తయారవుతాదన్నారు. ఈ రోడ్డు నిర్మాణానికి పుదుచ్చేరి ఆరోగ్యశాఖ మంత్రి మల్లాడి క్రిష్ణారావు, పరిపాలనాధికారి దవులూరి సుబ్రమణ్యేశ్వరరావులు నిధులు కేటాయించి చర్యలు చేపడితే ఈ ప్రాంతం ఎంతో అభివృద్ధి చెందుతాదని ఆశాభావం వ్యక్తంచేశారు. ఈ విషయంపై ఇప్పటికే అనేకసార్లు ప్రభుత్వ దృష్టికి తీసుకువెళ్ళటం జరిగిందన్నారు.

వెలుగు
తెలుగు దినపత్రిక
1 APR 2018
తేది :

# విద్యార్థుల శ్రమదానం





యానాం, మార్చి31(వెలుగు విలేకరి): వైఎస్సార్ విగ్రహం సమీపాన ఉన్న 52 ఎకరాల మంచినీటి చెరువులు చుట్టూ పిచ్చిమొక్కలు, చెత్తాచెదారం పేరుకుపోయిన విషయాన్ని ప్రతిరోజూ ఆ ప్రాంతంలో వాకింగ్ చేసే గోపాల్‌నగర్, గాంధీనగర్‌కాలనీలకు చెందిన ప్రజలు ప్రాంతీయ పరిపాలనాధికారికి ఫిర్యాదు చేయటంతో జాతీయసేవాసంఘం, మున్సిపల్ సిబ్బంది, ప్రజాపనులశాఖ సిబ్బంది సంయుక్తంగా 'స్వచ్ఛభారత్' కార్యక్రమాన్ని చేపట్టారు. డిప్యూటీ కలెక్టరు దవులూరి సుబ్రహ్మణ్యేశ్వరరావు, మున్సిపల్ కమిషనర్ గౌరీసరోజ, ఇతర సిబ్బంది కొడవలు, గొర్రెలు చేతపట్టి గడ్డిని, ఇతర మొక్కలను తొలగించారు. యానాం ప్రజలకు మంచినీటిని అందించే ఈ చెరువులకు రక్షణ గోడ లేక పశువులు, ఇతర జంతువులు వేసవి తాపాన్ని తగ్గించుకోవటానికి చెరువును ఆశ్రయిస్తున్న సంఘటనలు చోటుచేసుకుంటున్నాయని అధికారులు వెంటనే రక్షణ గోడను ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

# బాలయోగి మార్గ్‌కు హంగులు





యానాం, మార్చి31(వెలుగు విలేకరి): పర్యాటకంగా ప్రజలు ఆకర్షించాలంటే పరిసరాలు పచ్చదనంగా, నూతన కట్టడాల నిర్మాణం ఎంతో ముఖ్యం. యానాంలో ప్రధాన రహదారులు అందంగా కనిపించేందుకు రోడ్డుకు ఇరువైపులా ఉండే గోడలకు రంగురంగుల చిత్రాలను వేయించిన ప్రజాపనులశాఖ ప్రభుత్వ కార్యాలయాల ప్రాంగణం రహదారి బాలయోగిమార్గం మధ్య ఉన్న డివైడర్లను మార్పు చేసే పనిని చేపట్టింది. పది సంవత్సరాల క్రితం ఇనుప బద్దెలతో నిర్మించిన కంచెను తొలగించి స్టీల్‌మెటీరియల్‌తో చక్కనైన ఆకర్షించే డిజైన్‌తో రూపొందించిన గ్రిల్స్‌ను ఏర్పాటు చేస్తున్నారు. మూడు విభాగాలుగా ఉన్న ఈ డివైడర్లకు స్టీల్ గ్రిల్స్ అమర్చటం ద్వారా మరింత ఆకర్షణీయంగా కనిపించనుంది. ఇందాస్తంభం నుండి శివంభాత్ వరకు టీడు మెటీరియల్‌తో చేసిన గ్రిల్స్‌ను గత ఏడాది అమర్చారు.

1 APR 2018

# బాల్‌బ్యాడ్మింటన్‌లో యానాం విద్యార్థినికి బంగారుపతకం

**యానాం,మార్చి31,ప్రభాతవార్త:** యానాంకు చెందిన విద్యార్థిని యక్షశాంతి బాల్‌బ్యాడ్మింటన్‌లో అత్యంత ప్రతిభ కనబరిచి బంగారుపతకం సాధించింది. యానాం బాల్‌బ్యాడ్మింటన్ క్లబ్ క్రీడాకారిణిగా ఉన్న శాంతి ఈ నెల 25 నుంచి 27 వరకు బీహార్ రాష్ట్రంలో నిర్వహించిన తొలి బాల్ బ్యాడ్మింటన్ యూత్ నేషనల్స్‌లో ఇండియన్ యూనివర్శిటీ మహిళా జట్టు తరపున పాల్గొని ప్రథమస్థానంలో నిలిచి బంగారుపతకం సాధించినట్లు యానాం బాల్‌బ్యాడ్మింటన్ క్లబ్ కార్యదర్శి కె.ఎ.ఎ.శేషసుమన్ తెలిపారు. చెన్నైలో ఎస్ఆర్ఎం యూనివర్శిటీలో చదువుతున్న శాంతి 2016-17 ఆల్ ఇండియా ఇంటర్ యూనివర్శిటీ బాల్‌బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో బ్రాంజ్ మెడల్, 2017-18లో సిల్వర్‌మెడల్ సాధించడం జరిగిందన్నారు. ప్రస్తుతం బంగారుపతకం సాధించిన శాంతిని పుదుచ్చేరి ఆరోగ్యశాఖ మంత్రి మల్లాడి కృష్ణారావు అభినందించారు. అలాగే క్లబ్ కార్యదర్శి శేషసుమన్, కోచ్ బొక్కా శ్రీనివాస్, ఇతర క్లబ్‌ప్రతినిధులను ఆయన అభినందించారు.